సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



గురుకుల విద్యార్థినులకు విషజ్వరం

నందలూరు ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు విషజ్వరాల బారిన పడ్డారు. - 8లో



కారు సహా రూ. 8 లక్షలు విలువైన ఎర్రచందనం స్వాధీనం

కారుతోసహా రూ. 8 లక్షలు విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి రామ్లానాయక్ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 160 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పోలీసులపై ప్రజలకు నమ్మకం పెంచాలి

– జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకాన్ని పెంచాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి స్పందన కార్యక్రమం ద్వారా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో అందించిన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపిస్తే ఫిర్యాదుదారులకు సత్వరం న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనకు 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్టప్రకారం పరిష్కారం చూపాలని, ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయం లోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

– 13 మంది సభ్యులతో వన్‌స్టాప్ క్రైసిస్ టీమ్ ఏర్పాటు
– ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎస్. మూర్తి



కడప అర్బన్ : జిల్లాలో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరి నిర్మూలన కోసం 13 మంది సభ్యులతో వన్‌స్టాప్ క్రైసిస్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎస్. మూర్తి తెలియజేశారు. సోమవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవాసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ వారి సహకారంతో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరిల నిర్మూలనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎస్. మూర్తి మాట్లాడుతూ 13 మంది సభ్యుల బృందం జిల్లావ్యాప్తంగా మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, నిర్మూలనకోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, బాధితులను గుర్తిస్తారన్నారు. తద్వారా వారికి న్యాయ సహాయం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం వెట్టిచాకిరి పని విధానాన్ని నిర్మూలిద్దాం- వ్యక్తి స్వతంత్రాన్ని పరిరక్షిద్దాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత, కడప దిశ మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రెడ్డివారి వాసుదేవన్, రైడ్స్ సంస్థ ప్రతినిధి త్యాగరాజు, ప్యానల్ న్యాయవాది చంద్రకాంతమ్మ, పారాలీగల్ వలంటీర్ దశరథరామిరెడ్డి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి శ్యామ్ పాల్గొన్నారు.

దాహం తీరేలా నీళ్లు

- అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో వాటర్ గ్రిడ్ పనులు
- రూ.1,825.69 కోట్లతో కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం ఖరారు
- త్వరలో పనులు ప్రారంభం
- గండికోట నుంచి 3.37 టీఎంసీలు తరలింపు
- 13.94 లక్షల జనాభాకు నీళ్లు
- నీటి కష్టాలు, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం



పీలేరు నియోజకవర్గం మామిళ్లవారిపల్లె వద్ద వాటర్ రీట్రీట్ ప్లాంట్‌కు ఎంపిక చేసిన ప్రాంతం



బి.కొత్తకోట : అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల ప్రజలకు ఫ్లోరైడ్ సమస్య, తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వైఎస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు తరలించి నీటి శుద్ధీకరణ జరిపి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించే వాటర్ గ్రిడ్ పనులు దక్కించుకొన్న కాంట్రాక్టు సంస్థతో ప్రభుత్వ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. అన్నమయ్య జిల్లాలోని నాలుగు, చిత్తూరు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో వాటర్‌గ్రిడ్ అమలు చేసేందుకు రూ.2,400 కోట్లతో పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. రూ.1,825.98 కోట్లతో పనులు చేపట్టేందుకు గ్రామీణ నీటి సరఫరా శాఖ గత జూలైలో నిర్వహించిన టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఎన్‌సీసీ కంపెనీలు పాల్గొనగా అంచనా విలువకు మించి రూ.1,901.76 కోట్లకు టెండర్ దాఖలైంది. దీనిపై నిర్వహించిన రివర్స్ టెండరింగ్‌లో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలు చేసింది. దీనితో ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయింది. ఈ నెల ఒకటిన చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో టెండర్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, చిత్తూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగలక్ష్మిలు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. దీనితో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టేందుకు అధికారిక ప్రక్రియ పూర్తయింది.

27 మండలాలు, రెండు పురపాలికలు..

వైఎస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి తరలించే కృష్ణా జలాలతో అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం, మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీలకు తాగునీటిని అందించే పనుల ప్రక్రియ మొదలుకానుంది. 27 మండలాల్లోని 5,336 పల్లెల్లో 13,94,757 మంది ప్రస్తుత జనాభాకు ఇంటింటికి తాగునీటిని అందిస్తారు. గండికోట రిజర్వాయర్ నుంచి గాలివీడుకు 14.10 కిలోమీటర్ల పంపింగ్ పైప్‌లైన్, గండికోట నుంచి గాలివీడుకు గ్రావిటీ ద్వారా 122.40 కిలోమీటర్లు, గాలివీడు నుంచి గుర్రంకొండకు 28 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణ పనులు చేస్తారు. గాలివీడు మీదుగా గుర్రంకొండ, కేవీపల్లె మండలంలోని అడవిపల్లెకు తరలిస్తారు. రిజర్వాయర్‌లో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం జరిపి అక్కడి నుంచి శుద్ధిచేయని నీటిని రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు మీదుగా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ పరిసరాల్లో ఒకటి, కేవీపల్లె మండలం అడవిపలె పరిసరాల్లో ఒకటి రీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మిస్తారు. ఈ ప్లాంట్లలో శుద్ధిచేసిన నీటిని పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు. గండికోట రిజర్వాయర్ నుంచి 3.37 టీఎంసీల నీటిని తరలించుకునేందుకు ఆరు చోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తారు.

3,500 కి.మీ పైప్‌లైన్

గాలివీడు మీదుగా గుర్రంకొండ, కేవీపల్లె మండలంలోని అడవిపల్లెలో నిర్మించే రీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు నీటిని తరలిస్తారు. ఇక్కడి నుంచి మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా పల్లెల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేస్తారు. ట్యాంకుల నుంచి ప్రజలకు కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ట్యాంకులు లేని పల్లెల్లో రూ.454.57కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. రిజర్వాయర్ నుంచి నిర్మించే 220 కిలోమీటర్ల పైప్‌లైన్ కాక, మండలాల్లో 3,500 కిలోమీటర్లకుపైగా పైప్‌లైన్ పనులు చేస్తారు.

సీఎం గొప్ప మనసు



తంబళ్లపల్లె ప్రజలకు ఫ్లోరైడ్ కష్టాలు తొలగించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించా. దీనికి స్పందించిన సీఎం గొప్ప మనసు చాటుకున్నారు. తంబళ్లపల్లెతోపాటు మరో నాలుగు నియోజకవర్గాలకు ప్రతి కుటుంబానికి మంచి నీరు అందించేలా వాటర్‌గ్రిడ్ మంజూరు చేశారు. ఈ పనులు పూర్తయితే వచ్చే 30 ఏళ్లపాటు నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య ఉండదు.

– పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

త్వరలో పనులు



వాటర్‌గ్రిడ్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ పనులు పూర్తయ్యాయి. ఇక పనులు ప్రారంభం కానున్నాయి. కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద సమాచారం ప్రభుత్వానికి నివేదించనున్నాం. అనంతరం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్‌మతీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మదనపల్లె

రేపు వైఎస్సార్ జిల్లాకు మైనార్టీ కమిషన్ సభ్యురాలి రాక

కడప సిటీ : జాతీయ అల్ప సంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది బుధవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె 7వ తేదీ రాత్రి చిత్తూరు జిల్లా నుంచి బయలుదేరి కడపకు చేరుకుంటారన్నారు. బుధవారం ఉద యం 11 గంటలకు కడపలోని అమీన్‌పీర్ దర్గాను దర్శించుకుంటారని చెప్పారు.తర్వాత మైనార్టీ సామాజిక వర్గాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమంపై కలెక్టర్, ఎస్పీ, ఇతర మైనార్టీ అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. 3 గంటలకు పెండింగ్‌సమస్యలపై అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. 3.30 గంటలకు కలెక్టరేట్‌లో వీడియా సమావేశంలో ఆమె మాట్లాడతారని, అనంతరం రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళతారని కలెక్టర్ వివరించారు.

జీఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా రవిశంకర్‌రెడ్డి బాధ్యతలు



రవిశంకర్‌రెడ్డి

కడప సిటీ : గాలేరు–నగరి సుజల స్రవంతి(జీఎస్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)గా ఎ.రవిశంకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రోహిణి అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్‌కు బదిలీ అయ్యారు. అట్లూరుకు చెందిన కృష్ణకుమార్‌రెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరెడ్డిలు ఆయనను సత్కరించారు. రవిశంకర్‌రెడ్డి రాయచోటి తహసీల్దార్‌గా పనిచేస్తుండగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. 2011లో ఉద్యోగంలో చేరిన ఆయన కడప ఆర్డీఓ ఏఓగా, సీకే దిన్నె, కడప, కమలాపురం, దువ్వూరు, రాజంపేట, రాయచోటి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు.

సీటీఎం జాతర ప్రారంభం



బోనాలు తీసుకెళుతున్న మహిళలు (ఇన్‌సెట్) పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్మవారికి బోనాలు సమర్పణ

మదనపల్లె సిటీ : సీటీఎం నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం ఎదుట సిరిమానుకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సీటీఎం పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో జాతర వాతావరణం నెలకొంది. అమ్మవారి పుట్టినిల్లు మిట్టపల్లె నుంచి ప్రత్యేకంగా చీర, సారెను అందజేశారు. జాతర పురస్కరించుకుని సీటీఎం సర్పంచు ఆనందపార్థసారథి, తాలూకా సీఐ సత్యనారాయణ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయం పరిసర ప్రాంతాలు దుకాణాలతో నిండిపోయింది. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం రాత్రి తిరునాలకు చాందినీ బండ్లు తిరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాలికల వసతి గృహాలను తరచూ సందర్శించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



వసతిగృహాల పరిశీలనపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలోని బాలికల వసతి గృహాలను ప్రతి నెలా వివిధ శాఖల హెచ్‌ఓడీలు సందర్శించి విద్యార్థినుల సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన హాలులో వసతి గృహాల్లో చదివే బాలికల సంరక్షణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 53 ప్రభుత్వ బాలికల వసతిగృహాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని వివిధ శాఖల హెచ్‌ఓడీలు నెలకు రెండు సార్లు బాలికల హాస్టళ్లను సందర్శించి విద్యార్థినుల సమస్యలు గుర్తించాలన్నారు. 10–15 సంవత్సరాలలోపు విద్యార్థినులు తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతుంటారన్నారు. విద్యార్థినులు తమ సమస్యలు చెప్పడానికి భయపడితే మీ సమస్యలు టీచర్లకు చెప్పమని వారికి తెలియజేయాలన్నారు. వారు నేరుగా తమ సమస్యలు చెప్పలేకపోతే తెల్లకాగితం మీద రాయించుకుని అవి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థినులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా బాగా చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో తప్పకుండా ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థినుల సంరక్షణ మనందరి బాధ్యతగా భావించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు, మెడికల్ ఆఫీసర్, సచివాలయ పోలీసులు వసతి గృహాలను సందర్శించినప్పుడు ముఖ్యంగా విద్యార్థినులకు లైంగిక విద్య, అనీమియా నివారణ, బాలికల ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

స్పందన కార్యక్రమం ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు, డ్వామా పీడీ మద్దిలేటి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందన కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపి బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు శనివారం లోపల పరిష్కారం అయ్యేటట్లు చూడాలన్నారు. వివిధ సమస్యలపై పలువురు ప్రజలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు ప్రజల వినతులను జతచేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

• జాబిల్లి అందం.. వెన్నెల సోయగం



అందమైన జాబిల్లిని చూస్తే మనసు హాయిగా ఉంటుంది. పున్నమి చంద్రుడిని చూస్తే మనసు మరింత పులకిస్తుంది. సోమవారం రాయచోటి ఎస్పీ కార్యాలయం ఆవరణంలో ఓ వైపు పచ్చదనం.. మరోవైపు విద్యుద్దీప వెలుగులు.. ఇంకోవైపు వెన్నెల కాంతులు.. వెరసి మాఘ పౌర్ణమి తర్వాత అందాల చందమామ వెలుగు చూపరులను ఇట్టే కట్టిపడేసింది.

– సాక్షి, రాయచోటి

• అ'విశ్రాంత' వృద్ధురాలు!



ఈ చిత్రంలో మదనపల్లె ఆర్డీఓ మురళితో ముచ్చటిస్తున్న వృద్ధురాలి పేరు శ్యామలమ్మ. విశ్రాంత ఉపాధ్యాయురాలు. ఆమె ఉద్యోగ బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకున్నారు గానీ..తాను నివాసముంటున్న ప్రాంతంలోని సమస్యలపై మాత్రం అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి ఆమె తమ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఓ అర్జీని చేతపట్టుకుని వచ్చి ఆర్డీఓకు సమర్పించారు. 'మాకు మీరు న్యాయం చేయకపోతే ఎవరు చేస్తారు.. బాధ్యత కలిగిన పౌరురాలిగా వాళ్లందరి సమస్యను మీకు చెప్పేందుకు వచ్చాను'.. అంటూ ఆమె అమాయకత్వంగా చిన్నపిల్లల్లాగా చెబుతుంటే కొద్దిసేపు ఆర్డీఓతో పాటు అక్కడున్న సిబ్బంది, అర్జీదారులు సైతం నవ్వుల్లో మునిగిపోయారు. సీరియస్‌గా జరిగే కార్యక్రమంలో సరదాగా మాట్లాడుకోవడం, శ్యామలమ్మ సాధకబాధకాలు తెలుసుకుని ఆర్డీఓ మురళి.. ఆత్మీయుడిగా ఓదార్పు ఇవ్వడం, భరోసా కల్పించడం.. తోటి అర్జీదారులకు స్పందనపై మరింత నమ్మకం పెంచింది.

– మదనపల్లె

రాయచోటికి కేంద్రీయ విద్యాలయం

మంజూరు చేయండి

కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వినతి



కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని వీరు కలిశారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఉద్యోగులు నివాసాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థుల సౌకర్యం దృష్ట్యా కేంద్రీయ విద్యాలయం అవసరం ఉందన్నారు. స్థల సేకరణ కూడా పూర్తయిందని, ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోగా రాయచోటిలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలని మంత్రికి విన్నవించారు. అలాగే మదనపల్లెలో కూడా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని, ఈ రెండింటినీ మంజూరు చేసి ఈ విద్యా సంవత్సరం మొదట్లోనే ప్రారంభించాలని వారు కోరారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలి

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న రహదారులను జాతీయ రహదారులుగా మార్పు చేయడంతో పాటు ఉన్న జాతీయ రహదారుల విస్తరణ చేపట్టాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. సోమవారం న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి నివాసంలో రాయచోటికి సంబంధించిన జాతీయ రహదారుల అంశాలపై చర్చించారు. రాయచోటి జిల్లా కేంద్రం అయినందున ఇప్పుడున్న మూడు జాతీయ రహదారులకు అనుగుణంగా కదిరి – రాయచోటి–రాజంపేట– కృష్ణపట్నం రహదారిని నాల్గో జాతీయ రహదారిగా మార్చి టెండర్లు పిలవాలని కోరారు. గతంలో ఈ రహదారిని హైవేలోకి తీసుకున్నా నంబర్ ఖరారు కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ రహదారి పూర్తయితే కదిరి నుంచి కృష్ణపట్నం పోర్టుకు రవాణాకు అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే వేంపల్లె – రాయచోటి నిర్మాణంలో భాగంగా రాయచోటి పడమర ఉన్న బైపాస్ రోడ్డును కూడా నాలుగు లేన్ల హైవేగా మార్చేలా ఆమోదించాలని కోరారు. పనులను త్వరితగతిన ప్రారంభించి పనులు పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే కడప రోడ్డు నుంచి రాజంపేట , సుండుపల్లె రోడ్డు, గున్నికుంట్ల రోడ్డు మీదుగా పీలేరు రోడ్డును కలిపితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సంబేపల్లె, దేవపట్ల జాతీయ రహదారిలో డివైడర్ల ఏర్పాటు విషయాన్ని కూడా మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

విపత్తు సమయాల్లో ప్రజలకు అండగా నిలవాలి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించిన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ప్రజలను ఆదుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. జెడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సోమవారం వివిధ మండలాల కమ్యూనిటీ వలంటీర్లతో 12 రోజులపాటు ప్రారంభమైన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తులు సంభవించినపుడు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు వచ్చేవరకు ఆగకుండా ప్రజలను రక్షించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉద్దేశంతోనే క్షేత్రస్థాయిలో కమ్యూనిటీ వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకురావడం వల్ల కరోనా సమయంలో వలంటీర్లు ఎన్నో విలువైన సేవలను సకాలంలో ప్రజలకు అందించగలిగారన్నారు. వలంటరీ వ్యవస్థ పటిష్టంగా ఉంది గనుకే కరోనా వ్యాధిగ్రస్తులకు సంబంధించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రభుత్వానికి అందడంతో తగిన చర్యలు తీసుకోవడానికి సాధ్యపడిందని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే ఇలాంటి వ్యవస్థలు పటిష్టంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు విదేశాల ప్రశంసలు పొందాయని చెప్పారు దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఆంధ్ర రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశా, ఏఎన్ఎం వలంటీర్లు ఫీవర్ సర్వే వంటి కార్యక్రమాల ద్వారా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. అన్నమయ్య డ్యాం తెగిపోయి కొన్ని గ్రామాల ప్రజలు నిరాశ్రయులైనపుడు జిల్లా పరిషత్ చైర్మన్ అమరనాథరెడ్డి అన్ని తానై సహాయ సహకారాలు అందించారని తెలిపారు. వలంటీర్లకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బాలయ్య, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మందికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన నాలుగు ప్రమాదాల్లో తొమ్మిది మందికి గాయాలయ్యా యి. మదనపల్లెకు చెందిన అహ్మద్(19), సుహేల్ (20), హుస్సేన్ (19) కలిసి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్లి మదనపల్లెకు తిరిగి వస్తుండగా ఏడీఎస్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులతోపాటు మరో ద్విచక్రవాహనంలో ఉన్న వాహిద్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

■ మదనపల్లె మండలం 5వ మైలు రాయి వద్ద సోమవారం తెల్లవారుజామున జీపు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. వాహనంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన నాగేశ్వరరావు(46), వాల్మీకిపురం మండలం గంగాదొడ్డి గ్రామానికి చెందిన శ్రీరాములు(47), షఫీ(45) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితుల్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..

■ రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని తుమ్మలతండాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్రానాయక్(58) ఆదివారం రాత్రి చీకలబైలు చెక్‌పోస్ట్‌లో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా.. బెంగళూరు రోడ్డులోని మలుపులో అదుపు తప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..

రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. ఎన్.పీ.కుంట మండలం పెడబల్లి గ్రామానికి చెందిన అశోక్(29) పట్టణంలోని రామారావుకాలనీలో నివాసం ఉంటూ దుకాణాలకు పాలప్యాకెట్లు సరఫరా చేస్తుండే వాడు. నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులో నడుచుకుని వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే రెండు చోట్ల చోరీలు

కొండాపురం : మండలంలో సోమవారం పట్టపగలే రెండు చోట్ల చోరీలు జరిగాయి. కొండాపురంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉండే రంగాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లగా.. ఈ సంఘటన జరిగింది. చోరీకి ఎంత గురైంది అనే విషయం తెలియాల్సి ఉంది. తాళ్లప్రొద్దుటూరుకు చెందిన మల్లేశ్వర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో పాలతల దేవస్థానం వెళ్లారు. ఇదే అదునుగా భావించి దొంగలు ఇంటిలోని బీరువా పగలగొట్టి 8 తులాల బంగారం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మా.. పాహిమాం..

ఘనంగా విజయదుర్గ ఆలయ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : 'దుర్గమ్మా.. పాహిమాం' అంటూ భక్తులు శరణు వేడారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన సోమవారం శ్రీ విజయదుర్గ, మల్లికార్జునస్వామిలకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, షోడశ ఉపచార పూజలు చేశారు. దూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ మండపంలో శ్రీ చక్రం సన్నిధిలో భక్తులు, ఉభయదారులు శ్రీ చక్రార్చన నిర్వహించారు. యాగ మండపంలో వేద పండితులు రాయపెద్ది సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం మహిళా భక్తులు సామూహికంగా లలిత, శ్రీ విజయదుర్గ సహస్ర నామ పారాయణం చేశారు. రాత్రి అలంకరించిన పులి వాహనంపై శ్రీ విజయదుర్గ, మల్లికార్జునులను కొలువుదీర్చి భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేయించారు.

నేడు కల్యాణోత్సవం

శ్రీ విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మాఘ బహుళ విదియ నాడు అమ్మవారు కడప నగరంలో కొలువుదీరిన పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పంచవింశతి కలశాభిషేకం, చండీహోమం, శ్రీ చక్రార్చన, సాయంత్రం 3.30 నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవం, రాత్రి 8.30 గంటలకు నగరోత్సవం నిర్వహిస్తారు.


వృషభ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీ విజయదుర్గ మల్లికార్జునులు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

దయగల తల్లి.. లూర్దుమాత

- ఘనంగా మరియాపురం తిరునాల
- ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి

కడప కల్చరల్ : దయగల తల్లి అమలోద్భవి లూర్దుమాత సన్నిధి అత్యంత పవిత్రమైనదని, భక్తులకు ప్రీతికరమైనదని ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి అన్నారు. కడప నగరం మరియాపురంలోని పాత చర్చి ఆవరణలో తిరునాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన ప్రధాన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పైడికాల్వ విచారణ గురువులు సోమిరెడ్డిపల్లె చిన్నప్ప దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఫాదర్ ఆరోగ్యస్వామి మాట్లాడుతూ పాపమనే అంధకారంలో ఉన్న వారిని రక్షించేందుకు లోకరక్షకుడు ఈ ప్రపంచానికి మరియ ద్వారా రావడం అద్భుతమైన సంఘటనగా వర్ణించారు. ప్రపంచాన్ని రక్షించడానికి దేవుడు మరియమ్మను తల్లిగా ఎంచుకున్నాడని తెలిపారు. బాల్యం నుంచి ఆమె భక్తితో పెరిగిందని, దైవ సన్నిధిలో పరిపూర్ణమైన ధన్యతను సంతరించుకుని మానవులందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. మహిళా లోకానికి ఆమె ఆదర్శమూర్తి అని అభివర్ణించారు. ప్రారంభంలో మరియమాత స్వరూపంతో పల్లకీపై మరియాపురం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రధాన వేదిక వద్ద లూర్దుమాతను కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు.

కడప డీన్ పెండ్లికట్ల అబ్రహం, ఎంపీఎస్ ఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, తిరునాల కమిటీ చైర్మన్ వారాది జోసెఫ్, కార్యదర్శి లూర్దు, కోశాధికారి యు.విజయభాస్కర్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. పాలెంపల్లె ఉపదేశి మద్దెల ఆనంద్‌రావు గురువులను సత్కరించారు.


ప్రార్థన నిర్వహిస్తున్న గురువులు

చక్రస్నానం.. సర్వపాపహరణం

సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజావరోహణం

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరి ఘట్టమైన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఉన్న కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా స్నపన తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకించి తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీగంధం, కుంకుమ పువ్వులేపనంతో అలంకరించారు. తులసిమాల, సుగంధ వట్టివేరు మాలలతో అలంకరించి మంగళ స్నానాలు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా.. గోవిందా అంటూ దేవదేవున్ని వేడుకున్నారు. మహా మంగళహారతులు పట్టారు. ఉభయదారులు తల్లం చంద్రమౌళి దంపతులకు స్వామివారి మాలలను అందజేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కూడా ఆ కొలనులో మునిగి తేలారు. చక్రస్నానం నిర్వహించేటప్పుడు స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఊంజల సేవ చేపట్టి ఉభయదారులతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి వారికి తిరుప్పావడి (అన్నంతో స్వామివారి ప్రతిమ)నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం యాగశాలలో కళారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజాఅవరోహణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు ఏకాంత సేవ

వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలోని అద్దాల మండపంలో ఏకాంత సేవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. స్వామి ఏకాంత సేవలో భక్తులు పాల్గొని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.


నీటి కొలనులో శ్రీచక్ర స్నానం ఆచరిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు

ఫోర్జరీ నియామక పత్రంతో దొరికిపోయింది

- ఉద్యోగంలో చేరడానికి వెళ్లిన వైనం
- బోగస్ పత్రాలుగా నిర్ధారించిన అధికారులు
- వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయ పరిధిలో ఘటన

కడప రూరల్ : ప్రభుత్వ ఉద్యోగం కోసం ఆమె దొంగ దారిలో వెళ్లింది. ఏకంగా ఉద్యోగ నియామక పత్రాన్నే సృష్టించింది. అందులో అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసింది. ఉద్యోగంలో చేరడానికి వెళ్లింది. అధికారులు ఆరా తీయడంతో అడ్డంగా దొరికిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ ఏడాది జనవరి 17న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మీటింగ్ హాల్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ జరిగింది. ఈ నియామకాలకు సంబంధించి చిత్తూరు జిల్లాకు చెందిన హారతి తాను స్టాఫ్ నర్స్ పోస్టుకు ఎంపికైనట్లు, కడపలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం అధికారులు చిత్తూరు జిల్లా పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చినట్లుగా ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేసింది. ఆ నియామక పత్రంను చూసిన అధికారులు పూతలపట్టు పీహెచ్‌సీలో నిబంధనల ప్రకారం నలుగురు స్టాఫ్ నర్సులు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులు కడపలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ అధికారులకు తెలిపారు. ఆ వివరాలను ఇక్కడి ఆర్డీ కార్యాలయ అధికారులు పరిశీలించారు. అందులో ఈ నెల 3న కౌన్సెలింగ్ జరిగినట్లుగా ఉంది. ఆ రోజు అధికారులు ఇక్కడ ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించలేదు. అలాగే ఆ నియామక పత్రంలో రీజనల్ డైరెక్టర్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అధికారుల సంతకాలు ఉన్నాయి. అవి ఫోర్జరీ సంతకాలుగా గుర్తించారు. అసలు నియామకపత్రం, పోస్టింగ్ ఆర్డర్ కాపీనే ఒక బోగస్ అని తేల్చారు. ఎవరైనా అడ్డదారుల్లో ఉద్యోగం సంపాదించడానికి నకిలీ సర్టిఫికెట్స్‌ను తెచ్చుకుంటారు. ఈ మహిళా అభ్యర్థి ఏకంగా నకిలీ ఉద్యోగ నియామక పత్రంనే సృష్టించడం సంచలనంగా మారింది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఆ పత్రాలను పరిశీలించాం. అవి బోగస్ నియామక పత్రాలు. ఆ మహిళా అభ్యర్థిపై చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరు : కారుతో సహా రూ.8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి రామ్లానాయక్ తెలిపారు. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు అటవీ అధికారులకు ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం మండలంలోని గుండాల మల్లేశ్వర స్వామి ఆలయ సమీపంలో కాపు కాశారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మారేళ్ల వైపు నుంచి వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించగా.. చీకటిలో వేగంగా ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపి పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా 174 కేజీల బరువు గల ఎనిమిది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనంతోపాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్వో వేణు, బీటీ అధికారులు వెంకటేశ్వర్లు, మునిస్వామి, చంద్రకళ, రెడ్డి ఆసియా, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

గురుకుల విద్యార్థినులకు విషజ్వరం

35 మందికి చికిత్స చేసిన వైద్యులు

నందలూరు(రాజంపేట) : నందలూరు ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు విషజ్వరాల బారిన పడ్డారు. మండల వైద్యాధికారిణి సృజన, వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో వైద్య శిబిరం నిర్వహించి, 35 మందికి చికిత్సలు చేశారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ప్రిన్సిపాల్ మౌనికకు వైద్యాధికారి సృజన సూచించారు. 700 మంది విద్యార్థినులలో 140 మంది విషజ్వరాల బారిన పడినట్లు తెలిసింది. వీరిలో చాలా మందిని వారి సంబంధీకులు ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల క్రితం ఓ బాలిక అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

పరామర్శించిన ఎంపీపీ

గురుకులంను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను జ్వర పరిస్థితులు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థినులు చెప్పారు. ఆయన ప్రిన్సిపాల్ మౌనికకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన నీరు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఎంపీపీతోపాటు వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి సయ్యద్‌అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, బీసీ నేత హిమగిరియాదవ్, వైద్యసిబ్బంది లక్షుమయ్య, అంజలి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

ఆటోను ఢీకొన్న లారీ

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట ప్రధాన రహదారిపై సోమవారం ఆటోను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలం గోవిందంపల్లెకు చెందిన నూకరాజు సుబ్బయ్య(70)కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తిరుపతికి తీసుకెళ్లి చికిత్స చేయించుకుని.. ఆటోలో తిరుగు పయనమయ్యారు. ఆ ఆటో శెట్టిగుంట వద్దకు రాగానే వెనుక వైపు అతివేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నూకరాజు సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందగా.. శ్రీను, వెంకటేష్, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. సుబ్బయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీని స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన సుబ్బయ్య

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా..

- మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు
- వృద్ధుడి దుర్మరణం

చాపాడు : ఆస్పత్రికి వెళ్లి మోటారు సైకిల్‌పై వస్తున్న ఓ వృద్ధుడిని కారు ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. మండలంలోని నాగులపల్లె వద్ద మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తొండలదిన్నె దస్తగిరి(68) మైదుకూరులోని కడప రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ప్రొద్దుటూరు వైద్యశాలకు వెళ్లి మోటార్ సైకిల్‌పై వస్తుండగా మండల పరిధిలోని నాగులపల్లె వద్ద వెనకవైపు నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దస్తగిరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన దస్తగిరి

భర్తపై భార్య, బంధువుల దాడి

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో నివాసం వుంటున్న ఇర్ఫాన్ (30)పై భార్య, బంధువులు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలతో భార్య మిస్బా, భార్య మేనమామ, ఆటో డ్రైవర్ జమాలుద్దీన్, అత్త ఫయాజా, మామ బాబ్‌జాన్, మరదలు దాడి చేశారు. ఇర్ఫాన్ తలపై రాయితో జమాలుద్దీన్ దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల సాయంలో అతన్ని కడప రిమ్స్‌లో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.


గాయపడిన ఇర్ఫాన్

మెనూ ప్రకారం వడ్డించకుంటే చర్యలు

రైల్వేకోడూరు రూరల్/పెనగలూరు/పుల్లంపేట : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించకుంటే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేటలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రైల్వేకోడూరు మండల పరిధి కుక్కలదొడ్డి, శెట్టిగుంట పంచాయతీల్లోని ప్రభుత్వ రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరాజుపేట పంచాయతీలోని అంగన్వాడీ సెంటరు –2ను పరిశీలించారు. అదే పంచాయతీలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. పెనగలూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లోని హాస్టల్, కస్తూర్బా పాఠశాల హాస్టల్, సోషల్ వెల్ఫేర్ ఎస్సీ హాస్టల్, చౌక దుకాణాన్ని పరిశీలించారు. పుల్లంపేట మండల పరిధిలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె షామీర్ బాషా, డీఎస్ఓ రఘురాం తదితరులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట గురుకులంలో మాట్లాడుతున్న విజయ ప్రతాప్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

రాజంపేట/సింహాద్రిపురం : కడప –రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట బైపాస్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింహాద్రిపురం మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ (18) రాజంపేటలోని ఏఐటీఎస్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బయట హాస్టల్‌లో ఉంటూ చదువుతుండే వాడు. సోమవారం కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో ముందు హైదరాబాదు నుంచి చెన్నైకి వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేయబోయాడు. ఎదురుగా కారు రావడంతో అదుపు తప్పి లారీ కంటైనర్ కింద పడిపోయాడు. దీంతో శరీరం నుంచి తల తెగిపోయింది. అక్కడి నుంచి 400 మీటర్ల వరకు మొండం, బైకును లారీ ఈడ్చుకెళ్లింది. ఈ దృశ్యం చూసిన వారంతా భయాందోళనకు గురయ్యారు. సంఘటన స్థలానికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేరుకున్నారు. ప్రమాద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాబా ఫక్రుద్దీన్ తండ్రి గతంలో చనిపోగా.. తల్లి కూలీ పనులు చేసుకుంటూ చదివిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కుమారుడు కూడా చనిపోవడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ క్యాబిన్‌కు కర్ణాటక రిజిస్ట్రేషన్, కంటైనర్ ఉన్న బాడీకి హర్యానా రిజిస్ట్రేషన్ ఉండటంతో పోలీసులు ఆరా తీస్తున్నారు.


బాబా ఫక్రుద్దీన్ (ఫైల్)


సంఘటన స్థలంలో మృతి చెందిన బాబా ఫక్రుద్దీన్